క్లుప్తంగా

రహదారి పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

కొత్తూరు: మండలంలోని మాకవరం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాద రావు గురువారం ప్రారంభించారు. ఉపాధి నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్లు, ఇంకుడు గుంతలు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల ముస్తాబు



గొట్టిపల్లి వద్ద సిద్ధమైన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

నరసన్నపేట: సుబ్రహ్మణ్య షష్ఠికి వేళయ్యింది. స్వామిని కొలిచే వేడుక రానే వచ్చింది. నరసన్నపేట టౌన్‌లోని హడ్కో కాలనీ, గొట్టిపల్లి శివాలయం వద్ద, పెద్దపేట అమ్మవారి ఆలయం వద్ద ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను అర్చకులు సిద్ధం చేశారు. ఈ సారి షష్ఠి రెండు రోజులు ఉంటుంది. శుక్రవారం ఉదయం 10.48 నుంచి శనివారం ఉదయం 9.24 వరకు ఉంటుంది. ఈ రెండు రోజులూ భక్తుల దర్శనానికి అర్చకులు ఏర్పాట్లు చేశారు. సూర్యోదయం ఉన్న రోజునే మంచిదని పురోహితులు అంటుండటంతో శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకునే అవకాశం ఉంది.

ముంపును తట్టుకునే పంటలు వేయాలి



క్షేత్ర దినోత్సవంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

సరుబుజ్జిలి: ముంపును తట్టుకునే పంటలు వేయడం వలన అధిక లాభాలతోపాటు, నష్టాన్ని నివారించవచ్చునని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ హేమలత తెలిపారు. నిక్రా దత్తత గ్రామమైన కొండవలసలో గురువారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఎంటీయూ 1061 ఇంద్ర రకం విత్తనం ముంపును అధికంగా తట్టుకుంటుందన్నారు. పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అంతర పంటలతో మేలు

ఆమదాలవలస: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలో గల రైతులతో అంతర పంటలు సాగును చేయిస్తున్నట్లు డిజిటల్ ఎల్ టు సురేష్ గురువారం తెలిపారు. మండలంలోని జి.కె.వలస గ్రామంలో యూనిట్ ఇన్‌చార్జ్ నక్క చిరంజీవి ఆధ్వర్యంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో అపరాల పంటలో రబీ డ్రై షోయింగ్ విధానంలో అంతర పంటలు వేశారన్నారు. పొలం చుట్టూ మొక్కజొన్న, పంట వరుసలలో కట్టె జనుము, చిక్కుడు, గోంగూర విత్తనాలను వేయించినట్లు చెప్పారు. ప్రధాన పంటలో పలు రకాల అంతర పంటలు సాగు చేయడం వలన రైతుకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రధాన పంటను పురుగు, తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చునన్నారు. పంటలో జీవ వైవిధ్యం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, జానకిరామ్, కృష్ణవేణి, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ప్రసాదరావు

కొత్తూరు: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద గురువారం రాత్రి స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేశారు. అపరిచిత వ్యక్తుల వివరాలు నమోదు చేశారు. ఒడిశా నుంచి వస్తున్న ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణాపై పటిష్ట నిఘా వేశామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చలికాలం జరభద్రం



మంచులోనే పొలం బాట పడుతున్న గిరిజన రైతులు

- శ్వాస సంబంధిత వ్యాధులు వ్యాపించే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

పాతపట్నం: చలికాలం వచ్చిందంటే చాలు చల్లని వాతావరణంతోపాటు ఆహ్లాదంగా ఉంటుంది. ఆహ్లాదం మాటున అనారోగ్యాలను కూడా తెస్తోంది. ఉదయాన్నే లేచి వాకింగ్, జాగింగ్ వంటివి చేయడం నిత్యకృత్యమైనా.. చలికాలంలో చేయడం మరోక ఎత్తు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఈ కాలంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న కొద్దీ శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువని హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారు బయట తిరగకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరైతే ఫేస్ మాస్క్ ధరించి రావడం ఉత్తమమని తెలియజేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం..

చలికాలంలో వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో.. పరిసరాల పరిశుభ్రత కూడా అంతే ముఖ్యం. పరిసరాల పరిశుభ్రత లేకపోతే దోమలు వ్యాప్తి పెరిగి టైఫాయిడ్, డెంగీ, చికిన్ గున్యా, మెదడు వాపు, విషజ్వారాలు వచ్చే అవకాశాలు ఎక్కువ.

జాగ్రత్తలు తీసుకోవాలి



చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా రోగులు చలిగాలిలో, మంచు పడుతున్న సమయంలో బయట తిరగటం మంచిది కాదు. అలర్జీలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జలుబు, దగ్గు, ఫ్లూ వంటివి వ్యాపించి ఆరోగ్యం పాడవుతుంది. చిన్నారుల శరీరం వెచ్చగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎస్.కృష్ణారావు, సూపరింటెండెంట్, పాతపట్నం సీహెచ్‌సీ

వైద్యులు సూచిస్తున్న జాగ్రత్తలు ఇలా..

- జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో ఉపశమనం కోసం సొంత వైద్యం మానుకోవాలి. అందుబాటులో ఉన్న డాక్టర్‌ను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి.
- కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం మంచిది.
- వంట పాత్రలపై మూతలు తప్పనిసరిగా పెట్టాలి.
- చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహారం తీసుకోకూడదు.
- రాత్రి సమయాల్లో దోమ తెరలు వాడటం మంచిది.
- శీతల పానీయాలు, ఐస్ క్రీమ్‌లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా చిన్నారులను ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉంచాలి.
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.
- చిన్నారులకు స్వెటర్లు వేయకుండా బయట తిరగనీయకూడదు.

తాగునీటి విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం మరింత మంచిది. కలుషిత నీరు తాగితే డయేరియా వ్యాప్తించి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. గాలి ద్వారా స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలుతాయి. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

చిన్నారులూ జాగ్రత్త..



చలికాలంలో చిన్నారులకు జబ్బులు రాకుండా జాగ్రత్త వహించాలి. చలి నుంచి రక్షణకు వారికి స్వెటర్లు, వేడి నీటితో స్నానం చేయించాలి. ప్రయాణాలు తగ్గించుకోవడం వీలైనంత వరకు మంచిది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

– జి.వేణుగోపాల్, చిన్నపిల్లల వైద్యుడు, సీహెచ్‌సీ, పాతపట్నం

బహుమతుల ప్రదానం



జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలలో గీతా జయంతి పురస్కరించుకుని సత్సంగ్ సభ్యులు గురువారం పలు పాఠశాలల విద్యార్థులకు హెచ్‌ఎం మీస్ కేతస్ దాస్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రావాడ హేమ శిరీష (కరవంజ మోడల్ స్కూల్), రావాడ చాందిని (కరవంజ మోడల్ స్కూల్) పి.భువన (బుడితి ఉన్నత పాఠశాల) నిలిచారు. వీరికి బహుమతులు అందించారు. చల్ల మాన్యకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. సత్సంగ్ సభ్యులు రవి శంకర్, శ్రీనివాసరావు, దేవా, గోవిందరావు, ఆయా పాఠశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – జలుమూరు

స్పీడ్ బేకర్లు వేయాలి



బూర్జ జంక్షన్‌లో స్పీడ్ బేకర్లు వేయించాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం బస్సులు, భారీ వాహనాలతో రద్దీగా ఉంటుంది. బూర్జ గ్రామంలోకి మలుపు తిరగాలంటే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు బూర్జ గ్రామం, మరోవైపు శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారి ఉన్నాయి. బూర్జ జంక్షన్‌లో చాలాసార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే స్పీడ్ బేకర్లు వేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – బూర్జ

నేలను కాపాడుకుందాం



పాతపట్నం: భూమికి పూజిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాతపట్నం: నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నల్ల తారక రామారావు అన్నారు. పాఠశాలలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ సృష్టిలో జీవుల మనుగడకు నేల, నీటికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ రెండు సహజ వనరులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షం నీరు నేలలో ఇంకకపోతే వరదగా మారుతుందని, ఫలితంగా నేల కోతకు గురై బీటలు వారుతుందన్నారు. దేశంలో 65 శాతం భూమి వర్షాధారమేనన్నారు. అనంతరం పంట పొలాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశీలించారు. వ్యవసాయ శాస్త్ర ఉపాధ్యాయురాలు బలగ రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపేటలో..

బూర్జ: మండలంలోనని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేలను రక్షించాలన్నారు. ప్లాస్టిక్ వ్యార్థాలతో నేల సారవంతం కోల్పోతుందాన్నారు. సంస్థ సీఈఓలు నూక అనూప్, బెండి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



బూర్జ: ప్రపంచ నేల దినోత్సవంలో పాల్గొన్న ఆర్ట్స్ సంస్థ సభ్యులు

రసాయన ఎరువులను తగ్గించాలి

జలుమూరు: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాఖ నరసన్నపేట ఏడీ రవీంద్ర భారతి సూచించారు. గురువారం మండలంలోని టెక్కలిపాడు రైతు సేవా కేంద్రంలో ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. రసాయన ఎరువులు వాడకం వలన నేలకు మేలు చేసే అనేక సూక్ష్మజీవులు, వానపాములు అంతరించి పోతున్నాయన్నారు.

నిరుపయోగం..



భవనం చుట్టూ పెరిగిన మొక్కలు

సారవకోట: మండలంలోని పొప్పంగి సమీపంలో రంగసాగరం గట్టుపై నిర్మించిన మత్స్యకారుల సామాజిక భవనం నిరుపయోగంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవనాన్ని మత్స్యశాఖ నిధులు రూ.5 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఈ భవనం నిర్మించిన తరువాత జాతీయ రహదారి (326–ఏ) విస్తరణ చేపట్టారు. ఈ భవనానికి సమీపంలో టోల్‌గేట్‌ను నిర్మించారు. దీంతో భవనం వైపు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

పంపుహౌస్‌కు వెళ్లే దారేది..?

ఎల్.ఎన్.పేట: మండలంలోని సుమంతాపురం, గడేవానిపేట గ్రామాలకు తాగునీరు అందించేందుకు సుమంతాపురం రోడ్డు పక్కనే (సిద్ధాంతం కోనేరు వద్ద) పంపు హౌస్ నిర్మించారు. పంపు హౌస్ చుట్టూ పిచ్చిమొక్కలు, రెల్లగడ్డి పెరిగిపోయింది. పంపు హౌస్ లోపలికి వెళ్లి మోటారు వేసుకునేందుకు దారిలేకుండా పోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంపు హౌస్ చుట్టూ పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.



చుట్టూ పెరిగిన తుప్పలు

పేరెంట్ మీటింగ్ బాధ్యతగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎంఈఓలు, హెచ్‌ఎంలు

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం అన్ని సర్కారు పాఠశాలల్లో మెగా పేరెంట్ మీటింగ్ బాధ్యతగా నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామారావు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయిలో ఉన్న ఎంఈఓలు, పాఠశాల హెచ్‌ఎంలకు ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం సమావేశం నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. నరసన్నపేట నుంచి ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

11న గీతా జయంతి

ఆమదాలవలస: ఈ నెల 11వ తేదీన గీతా జయంతి సందర్భంగా స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భగవద్గీత ప్రచార సమితి, వికాస తరంగిణి ప్రతినిధులు, ఆలయ ధర్మకర్తులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు హరినామ సంకీర్తనలతోపాటు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు సామూహిక గీతా పారాయణ సహిత గీతా యజ్ఞం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తీర్థప్రసాద వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏఎస్‌ఓ శ్రీనివాసరావు

హిరమండలం: పేరెంట్స్ మీటింగ్‌ను పక్కాగా నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏఎస్‌ఓ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలోని పలు పాఠశాలల హెచ్‌ఎంతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 7న నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. మధ్యాహ్నం తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇంటి వద్ద విద్యార్థుల వ్యవహార శైలిని తల్లిదండ్రులకు అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందించాలన్నారు. సమగ్ర శిక్ష అధికారి ఉమ, హెచ్‌ఎం కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసన్నపేట: మాజీ సీఎం జగన్‌తో ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట నియోజకవర్గ నాయకులు



వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు మండలాలకు చెందిన ప్రధాన నాయకులు కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులతో మాజీ సీఎం జగన్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్నను డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వర రావు, నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పార్టీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, కేసీహెచ్‌బీ గుప్త, కణితి కృష్ణారావు, నక్క తులసీదాస్ కలిశారు.

జగన్‌ను కలిసిన కొత్తూరు నాయకులు..



కొత్తూరు: జగన్‌మోహన్‌రెడ్డికి సూర్యనారాయణ, రమేష్‌బాబును పరిచయం చేస్తున్న రెడ్డి శాంతి

కొత్తూరు: మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కొత్తూరు మండలం పీఏసీఎస్ మాజీ చైర్మన్, పార్టీ సీనియర్ నాయకుడు చింతాడ సూర్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకుడు కలమట రమేష్‌బాబు కలిశారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వీరిని జగన్‌మోహన్‌రెడ్డికి పరిచయం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జగనన్న సూచించినట్లు సూర్యనారాయణ తెలిపారు.

పాతపట్నం నియోజకవర్గం నుంచి..



ఎల్.ఎన్.పేట: జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రెడ్డి శాంతి, పార్టీ మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి

ఎల్.ఎన్.పేట: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని రెడ్డి శాంతి తెలిపారు. పార్టీ ఎల్.ఎన్.పేట మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి ఉన్నారు.

సారవకోట నుంచి..



సారవకోట: జగనన్నతో జెడ్పీటీసీ వరుదు నాగేశ్వరి, నాయకులు

సారవకోట: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని సారవకోట మండల నాయకులు కలిశారు. సారవకోట జెడ్పీటీసీ సభ్యుడు వరుదు నాగేశ్వరి, వైస్ ఎంపీపీ గుజుపురం రామారావు, మాజీ డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, మాజీ జెడ్పీటీసీ వరుదు రాఘవేంద్ర, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు ఉన్నారు.

ఆమదాలవలస నియోజకవర్గం నుంచి..

ఆమదాలవలస: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నియోజకవర్గ నాయకులు కలిశారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించినట్లు రవికుమార్ తెలిపారు. పార్టీ క్యాడర్ అంతా కలిసికట్టుగా పనిచేయాలని జగనన్న సూచించారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ జెడ్పీటీసీలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, బెజ్జిపురపు రామారావు, ఆమదాలవలస మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, ఆమదాలవలస పట్టణ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, తమ్మినేని శ్రీరామమూర్తి, ఖండాపు గోవిందరావు, పప్పల రమేష్, కళింగ కుల అధ్యక్షుడు దుంపల లక్ష్మణ రావు, బూర్జ సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం తదితరులు ఉన్నారు.



ఆమదాలవలస: జగన్‌ను కలిసిన చింతాడ రవికుమార్, నియోజకవర్గ నాయకులు



తాడేపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద ఆమదాలవలస నియోజకవర్గ నాయకులు

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కొత్తూరు: ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న పొనుటూరు, రాయల, 9న పారాపురం, 10న ఓంద్రుజోల, కలిగాం, 11న గురండి, బమ్మిడి, 12న సిరుసువాడ, 13న నివగాం, 16న అంగూరు, కడుము, కౌశల్యాపురం, 18న నేరడి, 19న మాతల, ఆల్తి, 20న అడ్డంగి, 21న వసప, సందిపాలం, 23న దిమిలి, 24న కురిగాం, 27న ఇరపాడు, పెద్దమడి, 28న ఆకులతంపర, శోభనాపురం, 30న కుద్దిగాం, చొంప, జనవరి 2న దిమిలి, బొడ్డగూడ, 3న పాతపాడు, వెంకటాపురం, 4న లబ్బ, 5న కర్లెమ్మ, 6న వీఎన్‌పురం, 7న కొత్తూరు, మహర్తాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.

ఎల్.ఎన్.పేట మండలంలో..

ఎల్.ఎన్.పేట: మండలంలోని శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. 6న పెద్దకొల్లివలస, జగన్నాథపురం, 9న గొట్టిపల్లి, కొమ్మువలస, 10న యంబరాం, తాయిమాంబాపురం, పాలవలస, 11న నరేంద్రపురం, ఎఫ్.డి పేట, బొడ్డవలస, 12న బొత్తాడసింగి, జాడుపేట, 13న పూశాం, 16న పెద్దకోట, జంగావలస, 17న కోవిలాం, రావిచంద్రి, 18న బొరమాంబాపురం, 19న ధనుకువాడ, సోమనాథపురం, చిట్టిమండలం, 20న మిరియాపల్లి, వాడవలస, 21న తురకపేట, కృష్ణాపురం, దబ్బపాడు, 23న సుమంతాపురం, సీతారాంపురం, 24 చొర్లంగి, 26న గార్లపాడు, 27న కొత్తపేట, 28న సరడాం, 30న జంబాడ, బొర్రంపేట, వలసపాడు, 31న కరకవలస, శ్యామలాపురం, జనవరి 2న చింతలబడవంజ, దొంకలబడవంజ, కవిటి, 3న మల్లికార్జునపురం, 4న ముంగెన్నపాడు, సిద్ధాంతం, బరటాం, 6న మోదుగువలస, వెంకంపేట, స్కాట్‌పేట గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తామన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు

కొత్తూరు: గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిసే కేసులు నమోదు చేస్తామని కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్ మణీశ్వరి హెచ్చరించారు. ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడారు. నాటు సారా వంట చేస్తున్న వ్యక్తులకు బెల్లం విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఒడిశా మద్యం, సారా ఆంధ్రాలోకి తీసుకువచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఒక వ్యక్తి మూడు మద్యం బాటళ్లు కంటే ఎక్కువ రవాణా చేయకూడదన్నారు. సారా వంట చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు గ్రామాల్లో దుకాణాలు, ఇళ్ల వద్ద బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.